కాసుల పురుషోత్తమ కవి

# ఆంధ్రనాయక శతకము

'పాఠకమిత్ర' వ్యాఖ్య





వ్యాఖ్యానం

**డా. అద్దంకి శ్రీనివాస్**

కాసుల పురుషోత్తమ కవి

# ఆంధ్రనాయక శతకము

వ్యాఖ్యానం

© డా. అద్దంకి శ్రీనివాస్

**Dr. Addanki Srinivas**

draddanki@gmail.com

Ph : 9848881838

2020

ISBN : 978-93-86040-98-5

**ప్రతులకు :**

**ఎస్.ఆర్. పబ్లికేషన్స్**

H.O : దిట్టకవి రాఘవేంద్రరావు వీథి,
ఇన్నర్ రింగ్ రోడ్, (అంబాపురం),
విజయవాడ రూరల్ - 520012
ఆంధ్రప్రదేశ్, ఇండియా.
Ph. : 0866 2436959, 2438959

B.O :
1-8-104,
అంబేద్కర్ కాలేజీ రోడ్,
చిక్కడపల్లి, హైదరాబాద్ - 500020.
**Cell :** 90324 28516

Cell : 94948 75959, 94938 75959, 95928 75959

మరియు

**ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణాలోని అన్ని బుక్‌షాపులు**

# తెలుగు సాహిత్యంలో ఆంధ్రమహావిష్ణువు - ప్రశస్తి

ఆంధ్రవిష్ణువు, ఆంధ్రనాయకుడు, ఆంధ్రవల్లభుడు, తెలుగురాయఁడు, తెలుంగు రాయఁడు, తెలుగు వల్లభుడు, శ్రీకాకుళనికేతనుండు, ఆంధ్ర మధుమథనుడు, తెలుగుభర్త, శ్రీకాకుళాంధ్ర నాయకుడు, శ్రీకాకుళాంధ్రదేవుడు, శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు మొ॥ నామాంతరాలతో విలసిల్లి తెలుగు సాహిత్యంలోనే కాక సంస్కృత సాహిత్యంలో కూడా కావ్యాలు, శతకాలు ఆవిర్భవించడానికి కారకుడయ్యాడు శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు.

కృష్ణాతీర ప్రాంతంలో గల శ్రీకాకుళం అనే పురంలో ఆంధ్ర మహావిష్ణువు అతి ప్రాచీనకాలంనుండీ వేంచేసిన ఒక దివ్య విష్ణ్వాలయం ఉంది. ఆ ఆలయంలో కొలువుతీరిన దైవమే ఆంధ్రమహావిష్ణువు.

తెలుగు సాహిత్యంలో ఆంధ్రవిష్ణువు ప్రస్తావన చాలా సందర్భాలలో ఉన్నప్పటికీ, అత్యధికంగానూ, ప్రధానంగానూ రెండుచోట్ల కన్పిస్తోంది. అవి 1. శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యద 2. కాసుల పురుషోత్తమకవి – ఆంధ్రనాయక శతకము.

ఈ రెండు గ్రంథాలలోనూ ఆంధ్ర విష్ణువు ప్రసక్తి ఉండడమే కాదు. అసలీ రెండు గ్రంథాలు ఆవిర్భవించడానికి మూలకారకుడు ఈ ఆంధ్రవిష్ణువే.

## ప్రాచీనత

ఆంధ్రమహావిష్ణువు వేంచేసి ఉన్న శ్రీకాకుళం ఆదినుంచీ శ్రీవైష్ణవులకు నిలయం. ఇప్పటికీ ఇక్కడ శ్రీవైష్ణవకుటుంబాలు ఎక్కువే. రామానుజులవారి విశిష్టాద్వైత బోధనలను ఆచరిస్తూ ప్రచారం చేసే కొందరు వైష్ణవగురువులు శ్రీకాకుళంలో నివసించేవారట. ఈ విషయాన్ని – 'ఉత్తారకపంచకాభ్యుదయ'మనే గ్రంథాన్ని రచించిన పరవస్తుకవి–

**'వచ్చి సదాంధ్రనాయకునివాసమునైన శ్రీకాకుళంబునన్**
**మచ్చిక వైష్ణవోత్తములమానిత వైభవ మొప్ప సన్నుతుల్**
**మెచ్చగ సేయ నాహరిని మేల్మి బ్రదక్షిణ పూర్వకంబుగా**
**హెచ్చిన భక్తిమ్రొక్కి మదికింపగు వేడ్కల నుండి వెండియున్'** అని పేర్కొన్నాడు.

పరవస్తుకవి వైష్ణవమతస్థుడు. శ్రీపరవస్తు గోవింద రామానుజ దేశికుల వారి శిష్యుడు. ముక్తామణీనాథునికి పుత్రుడు. ప్రాచీనకాలంనుండీ శ్రీవైష్ణవస్వాములకు ఆలవాలమైన ప్రాంతమే ఈ శ్రీకాకుళమని ఆధునికుడైన పరవస్తు కవి మాటల్ని బట్టి తెలుస్తోంది.

ఆంధ్రమహావిష్ణువును ప్రస్తుతించిన తెలుగు కవులలో ప్రథముడు అనంతామాత్యుడు. తన భోజరాజీయమనే గ్రంథంలో తన తండ్రి ఆంధ్రమహావిష్ణువును సేవించినట్లు ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు.

**విలసితంబగు కృష్ణవేణీ మలాపహా**
**రిణి భీమరథి నా ధరిత్రియందు**
**దనరు నదీత్రయాంతర్వేది యగు పావ**
**నక్షేత్రమున శోభనముల కెల్ల**
**ధరనివాసం బగు పెరుమగూరి పురంబు**
**నందు విద్వజ్జనానంద మైన**
**జీవనస్థితి చేత జెన్నొంది వంశక**
**ర్తృత్వసంపత్తి బ్రభుత్వమొంది?**

**నెమ్మి బ్రత్యక్షపరమ పద మ్మనంగ**
**నొప్పు శ్రీకాకుళంబున కొడయడైన**
**యాంధ్ర వల్లభ హరిసేవ నలరుచుండు**
**బెక్కు భంగుల ముమ్మడి తిక్కవిభుడు.'**

ప్రాచీనకాలం నుండి వైభవోపేతంగా ఆంధ్రనాయకుని తిరునాళ్ళు జరిగేవి. ఆ తిరునాళ్ళకు సంబంధించిన వర్ణనలు క్రీడాభిరామంలో కనిపిస్తాయి.

# ఆంధ్రనాయకశతకం - చారిత్రక నేపథ్యం

రాయలవారి తర్వాత కాసుల పురుషోత్తమకవి రచించిన ఆంధ్రనాయక శతకంలో ఆంధ్రమహావిష్ణువు దర్శనమిస్తాడు. 'కృష్ణాతీరమందలి శ్రీకాకుళ పుణ్యక్షేత్రమందు వెలయు నాంధ్రనాయక స్వామి దేవయతనాదులు శిథిలములై యుత్సవాదులు తగ్గియుండు కాలమున గాసుల పురుషోత్తమకవి నిందాస్తుతితో 'చిత్రచిత్ర ప్రభావదాక్షిణ్యభావ! హతవిమతజీవ శ్రీకాకుళాంధ్రదేవ!' యను మకుటము గూర్చి యీ సీస పద్య శతకమును రచించెను' అని ప్రాచ్యలిఖిత భాండాగారం తెలుపుతోంది.

ఈ శతకాన్ని పరిశీలిస్తే అంతకుముందు వైభవోపేతంగా జరిగే తిరునాళ్ళు ఆగిపోయి, నిత్యదేవతారాధన కూడా అంతంతమాత్రమై, కళారహితుడిగా ఉన్న ఆంధ్రమహావిష్ణువు, మళ్ళీ పూర్వవైభవం సంతరించుకోవాలని, ప్రజలలో మళ్ళీ స్వామిపై భక్తి విశ్వాసాల్ని పెంపొందింప జేయాలనే ఆశయం కన్పిస్తోంది.

భట్రాజుకులానికి చెందిన కాసుల పురుషోత్తమకవి వ్యాజస్తుతి అలంకారయుక్తంగా ఈ శతకాన్ని రచించాడు.

**'ధరనూటయెనిమిది తిరుపతులందు శ్రీ**
**కాకుళంబరయ ప్రఖ్యాతియేని**
**ఆంధ్రనాయకుడవం చఖిల దేశంబుల**
**నిన్ను గీర్తించుటే నిజమయేని**
**వైఖానసోక్తికి వంచన రాకుండ**
**నెఱులు జూపిన మాట నిజమయేని**
**వైకుంఠుడవు స్వయంవ్యక్తిగా నర్చావ**
**తార మొందిన మాట తథ్యమేని**

**వివిధ పూజోత్సవములు నిర్విఘ్నములుగ**
**జేసి కొనకున్న నీకు ప్రసిద్ధికలదె**
**చిత్ర చిత్ర ప్రభావ ! దాక్షిణ్యభావ !**
**హతవిమతజీవ ! శ్రీకాకుళాంధ్రదేవ !'** 12

అంటూ కీర్తినిందలతో ఆంధ్రవిష్ణువు వైభవాన్ని వర్ణిస్తూ, పూర్వవైభవం తిరిగి రావాలని ఆశించాడు.

## కవి ఆత్మీయత

ఆంధ్రమహావిష్ణువు దేవాలయంలో ఉత్సవాలు లేవని కవి వాపోయాడు. పూర్వవైభవాన్ని మళ్ళీ సంతరింపజేయడానికి **'కీర్తినిందల వర్ణించి గేలిపరతు'** అంటూ తన రచనను కొనసాగించాడు.

**కోరికలీను వైకుంఠంబులోని లో**
**నగరిలో నామూల నవ్యదివ్య**
**సౌధంబు దాపలి సరసమందార వ**
**నాంతరామృతసరః ప్రాంత చంద్ర**
**కాంతోపలోత్పల కల్పిత పర్యంక**
**సకల భాగ్య లక్షణ నివాస**
**లక్ష్మీ మనోజ్ఞ విలాసవశీకృత**
**సంభోగ సామ్రాజ్య సంతతాభి**

**రామమూర్తికి వాంఛేతర ప్రపంచ**
**మేమిగావలె లీలార్థ మింతెగాని**
**చిత్ర చిత్ర ప్రభావ ! దాక్షిణ్యభావ !**
**హతవిమతజీవ ! శ్రీకాకుళాంధ్రదేవ !** **99**

పోతనగారి పద్యమైన 'అలవైకుంఠ పురంబులో' అనే పద్యాన్ని స్మరణకు తెస్తూ, సకల భోగనివాసియైన శ్రీమహావిష్ణువు శ్రీకాకుళంలోని ఆంధ్ర విష్ణ్వాలయంలో ఉత్సవాలు లేకపోవడాన్ని గమనించకపోవడం అతని లీలావిశేషమేనని భంగ్యంతరంగా ప్రకటిస్తూ, దేవాలయ వైభవాన్ని సముద్ధరించమన్న విన్నపాన్ని మృదువుగా చేశాడు. అలాగే –

# ఆంధ్రనాయక శతకము

## పాఠకమిత్ర వ్యాఖ్య

సీ. శ్రీమదనంతలక్ష్మీ యుతోరఃస్థల
        చతురాననాండ పూరిత పిచండ !
    దర చక్ర ఖడ్గ గదా శరాసనహస్త !
        నిఖిల వేదాంత వర్ణిత చరిత్ర !
    సకల పావన నదీ జనక పాదాంభోజ !
        రమణీయ ఖగకులోత్తమ తురంగ !
    మణి సౌధవ త్ఫణామండ లోరగతల్ప !
        వరకల్పకోద్యాన వన విహార !

తే. భాను శితభాను నేత్ర ! సౌభాగ్యగాత్ర !
    యోగిహృద్గేయ ! భువనైక భాగధేయ !
    చిత్ర చిత్ర ప్రభావ ! దాక్షిణ్యభావ !
    హతవిమతజీవ ! శ్రీకాకుళాంధ్రదేవ ! 1

వ్యాఖ్య : కృష్ణానదీతీరంలో ఉన్న 'శ్రీకాకుళం' అనే క్షేత్రంలో కొలువై ఉన్న ఆంధ్రమహావిష్ణూ ! నీ ప్రభావం అనేకవిధాలుగా ఉంటుంది. అది ఎప్పటికప్పుడూ మారిపోతూ ఉంటుంది (చిత్ర). అలాగే ఆశ్చర్యాన్నీ కలిగిస్తుంది (చిత్ర). అలాంటి మహిమలు కలిగిన స్వామీ (ప్రభావం = ప్రతాపం, శక్తి, తేజస్సు, సామర్థ్యం) ! మనసునిండా దయ నిండినవాడా (దాక్షిణ్యం = కరుణ, భావం = మనసు) ! ఆంధ్రనాయకా ! (ఇది మకుటం. ప్రతి పద్యానికీ వ్యాఖ్యానంలో దీనిని ముందు చేర్చుకొని చదువుకోవాలి).

శ్రీకాకుళంలోని ఆంధ్రమహావిష్ణువుతో పాటు అవతరించిన అమ్మవారిపేరు అనంతలక్ష్మి. అంటే అనంతలక్ష్మీ సమేత ఆంధ్రనాయకుడన్న మాట. అలాంటి అనంతలక్ష్మిని వక్షఃస్థలంలో ధరించినవాడా !

చతురాననుడు అంటే బ్రహ్మ. చతురాననాండాలు అంటే బ్రహ్మాండాలని. ఆ బ్రహ్మాండాలు పద్నాలుగూ తన ఉదరంలో - పొట్టలో (పిచండ) ధరించి ఉన్నవాడా !

శంఖం (దర), చక్రం, ఖడ్గం, గద, విల్లు (శరం + ఆసన) చేతిలో ధరించినవాడా !

అన్ని ఉపనిషత్తులలోనూ – వేదాంతాలలో వర్ణించబడిన చరిత్ర కలవాడా ! అంటే వేదాంతాలు ఈయన గురించే చెప్తాయని.

అన్నింటినీ పవిత్రంగా చేసేనది గంగానది. ఆ నది విష్ణుపాదంనుండి పుట్టింది. కాబట్టి గంగానదికి తండ్రి (జనక) విష్ణుపాదమే ! ఆ పాదం పద్మంలా ఉంది. గంగానదికి తండ్రియైన పాదపద్మం కలవాడా !

అందమైన పక్షులకు రాజైన (ఖగకుల + ఉత్తమ) గరుత్మంతుణ్ణి వాహనంగా (తురంగ) కలవాడా !

మణిభవనంలా తన పడగలతో (ఫణామండల) ఏర్పడ్డ ఆదిశేషుడి పాన్పు కలవాడా (ఉరగతల్ప) అంటే ఆదిశేషుడు వేయిపడగలపై ఉన్న మణులూ, ఆ మణులతోకూడిన పడగలు మణులు పొదిగిన భవనాల్లా ఉన్నాయి. అలాంటి ఆదిశేషుడినే పాన్పుగా కలవాడా !

శ్రేష్ఠమైన కల్పవృక్షాలు ఉన్న ఉద్యానవనంలో విహరించేవాడా ! సూర్యచంద్రులే నేత్రాలుగా కలవాడా (శితభాను = చంద్రుడు, చల్లని కిరణాలు కలవాడని), మంగళకరమైన శరీరం (గాత్ర) కలవాడా ! యోగులహృదయంలో నిరంతరమూ గానం చేయబడేవాడా ! లోకాలన్నింటిలోనూ గొప్ప అదృష్టం కలవాడా (భాగధేయ) ! పరబ్రహ్మస్వరూపమని.

**విశేషాలు :** ఇది కావ్య ఆరంభపద్యం. సంస్కృతసమాసాలతో, అందమైన శబ్దాలంకారాలతోకూడిన పద్యం. నేత్ర–గాత్ర, హృద్గేయ–భాగధేయ మొదలైన అంత్యప్రాసలు రచనకు అదనపు అందాన్ని సమకూర్చాయి.

**వ్యాఖ్య :** ఆంధ్రనాయకా ! నువ్వు దూడలు కాస్తున్నప్పుడు నీ దూడలలో ఒక బయటిదూడవచ్చి కలిసి మేత మేస్తుంది. దానిని చూసి అలాగే పట్టుకొని చావగొట్టావు. (ఇది వత్సాసుర సంహారం. దూడరూపంలోవచ్చిన రాక్షసుణ్ణి శ్రీకృష్ణుడు మట్టుపెట్టాడు). ఒక ఆంబోతు రంకెవేస్తూ పొడవడానికి వేగంగా రాగానే దాని కొమ్ములు పట్టుకొని చంపి దాన్ని నామరూపాలు లేకుండా చేశావు (అరిష్టుడు అనే రాక్షససంహారం). ఒక రాక్షసుడు – పేరు బకాసురుడు (కొక్కరాయి) వచ్చి ముక్కుతో పొడుస్తుంటే దానిని నైపుణ్యంగా మెడవిరిచి చంపావు. వెనుకకాళ్ళతో తన్నే స్వభావం కలదనీ జంతువుల్లో హీనమైనదనీ (మృగ + అధమము) అని కూడా ఎంచకుండా ఒక గాడిదను (గార్దభమును) ధేనుకాసురుణ్ణి చంపావు. ఇవన్నీ బాల్యక్రీడలు. ఇన్ని దారుణాలు చెయ్యాలా? ఏం ఘనకార్యాలు చేశావయ్యా ! ఈ భూమిపై నువ్వు. నువ్వుచేసేవన్నీ ఇలాంటి పనికిమాలిన పనులే ! అని నింద. కానీ చిన్నతనంలోనే అందరు రాక్షసుల్ని సంహరించడం ఘనకార్యాలు కావూ ! అని స్తుతి.

★ ★ ★

**సీ.** **కవ్వడి కెంత చక్కఁగ బోధ చేసిన**
**నితరహింసాకర్మ మిష్టపఱుప**
**రాయబారం బెంత రసికత నడిపిన**
**ననికి భారతుల నాయత్త పఱుప**
**విశ్వరూపం బెంత విమలతఁ జూపిన**
**నోర్వని కురురాజు నులుకు పఱుప**
**విలుఁ బట్ట నని యెంతొ చెలిమిగఁ బలికిన**
**నవల సుయోధను నాసపఱుప**

**తే.** **పోరు చంపక చుట్టముల్ పోర నీల్గఁ**
**జూచుచుంటివి యేనాఁటి చుట్ట మీవు?**
**చిత్ర చిత్ర ప్రభావ ! దాక్షిణ్యభావ !**
**హతవిమతజీవ ! శ్రీకాకుళాంధ్రదేవ !** **32**

**వ్యాఖ్య :** ఆంధ్రనాయకా ! దుర్యోధనుడు నిన్ను చంపకూడదని (అవధ్యుడు = దూతగావచ్చిన వారిని చంపకూడదని) విడిచిపెట్టాడు కానీ కోపంతో అతడు నిన్ను బంధించాలని చూడలేదూ !

'నువ్వు గోపాలుడివి నీకు ఈ సత్కారం ఎందుకు?' అని నిండు సభలో శిశుపాలుడు (చైద్యుడు) ఎదిరించి నిన్ను తిట్టలేదూ !

నీ లాంఛనాలు – శంఖచక్రాలు పోలినవాటిని ధరించి పౌండ్రక వాసుదేవుడు అనేవాడు తానే నిన్నుగా భావించి – నేనే అసలు వాసుదేవుణ్ణని ఉద్ధతితో అనలేదూ !

నిన్ను ఎవ్వరూ పట్టుకోలేరనీ నేనే పడతాననీ పట్టుపట్టి కాలయవనుడు నిన్ను యుద్ధంలో (ఆహవమునన్) తరమలేదూ !

నీకు ముందు కొందరు రాజులు భయపడ్డారా? లేదుకదా ! ప్రాణాలమీద ఆశవిడిచిపెట్టిన వాళ్ళు యుద్ధంలో (భండనమునన్) నీకు భయపడలేదు.

శ్రీకృష్ణావతారంలో దుష్టసంహారంకోసం శ్రీకృష్ణుడు – సమయం సందర్భంకోసం సంయమనాన్ని పాటించాడు. అవే లీలలు. పైకి వాళ్ళు భయపడనట్లు ఉన్నా చివరికి భయపడి వాళ్ళందరూ వాళ్ళ వాళ్ళ శాపాలను బట్టి మరణాల్ని పొందారు. ఆ రహస్యాన్ని చెప్తున్నాడు కవి.

✶ ✶ ✶

**సీ.** **రాజు లెవ్వరుఁ బంక్తిభోజన మిడకున్న**
**దాసునింట భుజించి తనియలేదొ?**
**బంధువు లెవ్వరు గంధ మీ కుండిన**
**ముష్వంకలది పూయ మురియలేదొ?**
**దొర లెవ్వరును బూలసరము లీకుండినఁ**
**దెలిసి మాలికుఁ డీగ నలరలేదొ?**
**ప్రభువు లెవ్వరు వస్త్రబహుమాన మీ కున్నఁ**
**దెచ్చి యిచ్చిన చాకి మెచ్చలేదొ?**

**తే.** **పాటి సేయంగ నేరాజు బంధుగుఁడవొ?**
**మున్నె నీపస దెలిసిన దెన్న నేమి?**
**చిత్ర చిత్ర ప్రభావ ! దాక్షిణ్యభావ !**
**హతవిమతజీవ ! శ్రీకాకుళాంధ్రదేవ !** **35**

**వ్యాఖ్య :** ఆంధ్రనాయకా ! నువ్వు పూతన అనే రాక్షసి తాలూకూ కుంభాల్లాంటి కుచాలలో నిండి ఉన్న విషాన్ని స్తన్యంచేసి – తాగి (పాయివై) బతికి బట్టకట్టావు. దాని భాగ్యం ఏముంది చెప్పు?

కాళియుడు అనే సర్పం తాలూకూ కోర (ఆశీ)లో ఉన్న విషాన్ని తిని (గ్రసన) నువ్వు జీవించావు. ఆ ఘనత ఏమున్నది?

చాణూరుడు, మల్లుడు మొదలైన యుద్ధవీరుల భుజస్తంభాల నలుపుళ్ళకింద నలిగి ఓర్చుకున్నావు. గెలుపును పొందావు. దాని లాభం ఏమి?

సాళ్వరాజు అమోఘమైన – నాశనంలేని శక్తి ఆయుధం నీపై ప్రయోగించాడు. (ఇతడు ఒక రాజు. గదాయుధంతో శ్రీకృష్ణుడు ఇతణ్ణి సంహరించాడు). ఆ శక్తి ఆయుధ ప్రయోగంనుండి తప్పించుకొన్న సామర్థ్యంవల్ల ప్రయోజనం ఏముంది?

ఇప్పుడు పేదదాసరిలా బడుగుజీవిలా అన్నవస్త్రాలకు నువ్వు పరులకు – ఇతరులకు ఆశిస్తున్నావు. నీకు ఇంత పంతమెందుకు స్వామీ !

✶ ✶ ✶

**సీ.** **పట్టి గొల్లది రోఁట గట్ట నోపిననీకుఁ**
**రోసంబు లే దన్న నీసు గలదె?**
**జారచోరాదిచేష్టలఁ బ్రవర్తిల్లు నీ**
**కపకీర్తి యన్న భయంబు గలదె?**
**భార్యచేఁ దన్నులుఁ బడ్డవానికి నీకు**
**లజ్జ లే దని యన్న లాఘవంబె?**
**కుండంటు లే దని కొసరి మెక్కిన నీకు**
**హీనత లెంచిన న్యూన మగునె?**

**తే.** **కోరి దాసులు ని న్నెంత దూరుచున్నఁ**
**బంత మున్నదె నీ కిసుమంత యైన?**
**చిత్ర చిత్ర ప్రభావ ! దాక్షిణ్యభావ !**
**హతవిమతజీవ ! శ్రీకాకుళాంధ్రదేవ !** **41**

**వ్యాఖ్య :** ఆంధ్రనాయకా ! ఒక జీవిని ఇంకో జీవికి ఆహారంగా పెట్టి ఒకదానినొకటి చంపుకొని తిని బతకమని చేశావు అంతేకానీ ఏ ఒక్క జీవికైనా ఇంతైనా ఏదైనా కొనిపెట్టావా స్వామీ !

చేసుకున్నవాడికి చేసుకున్నంతే అనుభవించే అవకాశం ఇచ్చావుగానీ ఎక్కువ తక్కువలు ఎవరికైనా ఇచ్చావా?

అందరినీ కర్మసూత్రంతో కట్టి తిప్పుతూ ఉంటావుగానీ ఎవడినైనా వాడి ఇష్టానికి (ఇచ్చున్) పోనిచ్చావా?

చక్కగా (వెసన్) ఎవరికి వారికి వేరువేరు బుద్ధులు ఇచ్చి (పృథక్ ప్రకృతులన్) వేరు వేరుగా పెట్టావుగానీ అందరికీ ఐకమత్యం ఇచ్చావా?

దేవదేవా ! నీ రక్షకత్వం మాకు తెలిసిపోయిందిలే ! మాకు వేరేదిక్కులేక నిన్ను సేవింపవలసి వస్తోంది. అంతే ! ఏంచేస్తాం మరి.

**విశేషాలు :** ఇది భగవత్ సృష్టిలోని రహస్యం. ఒక జీవిని మరో జీవికి ఆహారంగా పెట్టడం ప్రకృతి సమతౌల్యం. అందరినీ ఒకేలా చూడడం, కర్మ సూత్రంలో తిప్పడం, వైవిధ్యంలో ఉంచడం ఇవన్నీ భగవంతుడి లీలలే !

★ ★ ★

**సీ.** **నీరుపట్టుగ నుంట నారాయణుండ వండ్రు**
**నారాయణాఖ్యాధికార మేమి?**
**బలిసి యంతట నీవె గలుగ విష్ణుఁడ వందు**
**రావిష్ణునామప్రభావ మేమి?**
**ముగురు నీవై వెలుంగఁగఁ గేశవుఁడ వండ్రు**
**కేశవాభిఖ్యాప్రకాశ మేమి?**
**సిరికి మగండ వై మెరయ శ్రీపతి వండ్రు**
**శ్రీపతినామప్రసిద్ధి యేమి?**

**తే.** **పెట్టుపేరు లనేకముల్ పుట్టుపేరు**
**గుఱుతెఱింగిన నీమూల మెఱుఁగవచ్చు**
**చిత్ర చిత్ర ప్రభావ ! దాక్షిణ్యభావ !**
**హతవిమతజీవ ! శ్రీకాకుళాంధ్రదేవ !** **56**

**వ్యాఖ్య :** ఆంధ్రనాయకా ! నువ్వు ధర్మానికి విఘాతం – చేటు కలిగించినప్పుడు మూడులోకాలు గగ్గోలు పెట్టాయి. ధర్మము అంటే విల్లు అని అర్థం. ఈ భూమిపై (ఈ + ధరన్) నువ్వు శివధనువును భంగం చేయడంవల్ల నీ పరాక్రమాన్ని చూసి లోకాలు ప్రశంసించాయని స్తుతి.

జనకుడు అంటే తండ్రి అని సాధారణార్థం. తోడబుట్టిన అమ్మాయినే కోరికోరి నువ్వు పెళ్ళిచేసుకొన్నావు. సీతను పెండ్లాడావు. అది చూసి అందుకే రాజసమూహం (నరనాథకోటులు) అప్పుడే నవ్వారు. ఇది నింద. నిజానికి 'జనకుడు'అనే మహారాజు కూతురు సీత. కాబట్టి నీ పరాక్రమానికి సిగ్గుపడి రాజులందరూ అవమానాల్ని పొందారు. ఏడవలేక నవ్వారు అని.

పుణ్యజనులు అంటే నిందార్థంలో సజ్జనులు అని. వాళ్ళను యుద్ధంలో (పోరన్) బాధించడంతో దేవతలు (సురలు) అప్పుడే అద్భుతంగా చూశారు. ఇది ఎక్కడైనా ఉంటుందా? అని నింద. కానీ 'పుణ్యజనులు' అంటే రాక్షసులు అని అర్థం. రాక్షసుల్ని యుద్ధంలో చంపుతూ ఉంటే దేవతలు ఆశ్చర్యంగా చూశారని స్తుతి.

ఎల్లప్పుడూ ఆశ్రయించినవారిపట్ల భయంకరంగా ప్రవర్తించేవారిని (అంటే రావణాసురుణ్ణి ఎదిరించివచ్చిన విభీషణుడని) నువ్వు రాజుగా పట్టాభిషేకం చేశావు. దానికి సూర్యచంద్రులు సాక్ష్యంగా నిలిచారు (రవి + ఇందు) ఇది నింద. తననుకోరి ఎల్లప్పుడు (సంతత) ఆశ్రితుడైనవాడు విభీషణుడు. వచ్చి రాముణ్ణి శరణాగతి చేశాడు.

అతణ్ణి రాజుగా చేశావని స్తుతి. కాబట్టి ఎంచిచూస్తే మంచి నడవడికే నడిచావులేవయ్యా స్వామీ ! ఈ వార్తలు – నీ ప్రవర్తనలు వింటుంటే మంచి కీర్తిగలవాడివేనని తెలుస్తున్నదిలే స్వామీ !

★ ★ ★

**వ్యాఖ్య :** ఆంధ్రనాయకా ! రాజకార్యాన్ని చేయాలన్న తాత్పర్యబుద్ధి కలవాడూ (రాజకార్యపరుడు); తేజస్సు, బలం మొదలైన వాటిలో అధికమైనవాడూ ఆంజనేయుడు. అతడు నీ సేవకుడు (భృత్యుడు). కాబట్టీ;

అలాగే – గొప్ప పరాక్రమంకలవాడు (శౌర్యుడు), వానరకులానికి రాజు (ప్లవంగకుల + ఈశుడు), సూర్యుడి కుమారుడు (ఇనజుడు), నీకు అరమరికలులేని స్నేహితుడు అయ్యాడు కాబట్టి (సుగ్రీవుడు);

శత్రువుల రహస్యాలు (విమతమర్మము) తెలిసినవాడు, విశ్వాసపాత్రుడు అయిన ఆ విభీషణుడు నీకు ఆప్తుడు కావడం వల్లనూ;

దేవతలు (సుమనస్కులు) మంచి మనసున్నవాళ్ళు, అమనస్కులు – యోగీంద్రులు, తమ తమ అమృతవాక్యాలతో నిన్ను చక్కగా తగినవిధంగా ఆశీర్వదించడంవల్లనూ; నువ్వు లంకానగరాన్ని సాధించావుగానీ నీ బలం ఏపాటిది? ఈ లావుతో ఆ రాక్షసులను (నిర్జర + అరుల) గెలవడం నీ తరమా?

**విశేషాలు :** ఎందరో వీరుల్ని ప్రస్తావించి వారి సహాయం లేకపోతే నువ్వు లంకను గెలిచేవాడివి కావని అధిక్షేపిస్తున్నాడు నిందాత్మకంగా. కానీ అంతటి బలవంతుల్ని చక్కదీర్చి వాళ్ళను నాయకుడై నడిపించాడన్నది ఇందులోని ధ్వని. స్తుతి కూడా.

★ ★ ★

**సీ.** **నడువఁజాల దని జానకి నెత్తుకొని ముందు**
**నడచు విరాధుని నఱకు టేమి?**
**చనవున వైదేహి చనుబిడ్డవలెఁ నోటఁ**
**బట్టిన యైంద్రికన్గొట్టు టేమి?**
**సీత సంతోషింపఁ జిత్రవేషముఁ దాల్చి**
**తిరుగు మారీచుని నఱకు టేమి?**
**తల్లినివలెఁ దెచ్చి ధరణీజను నశోక**
**వని నిల్ప రావఁణు దునుము టేమి?**

**తే.** **కోప మిటు లేమి? వారు మహాపరాధు**
**లైన ముక్తిప్రసాదార్హు లగుట యేమి?**
**చిత్ర చిత్ర ప్రభావ ! దాక్షిణ్యభావ !**
**హతవిమతజీవ ! శ్రీకాకుళాంధ్రదేవ !** 77

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Andhranayaka+Satakamu**

* * *